WANTED

**జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.**

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లాబ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్/మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

**సంప్రదించాల్సిన నెంబర్లు:**
**9492580091**

facbook.vaaradhinews.com

# వారధి

తెలుగు దిన పత్రిక

www.vaaradhinews.com

సంపుటి:2
సంచిక:09
బుధవారం,
12.09.2024




## వయో వృద్ధులకూ ఆరోగ్య బీమా

- 70 ఏళ్లు పైబడ్డ వారికీ ఆయుష్మాన్ భారత్ పథకం వర్తింపు
- 4.5 కోట్ల కుటుంబాలకు ప్రయోజనం
- జల విద్యుత్ ప్రాజెక్టులకు రూ.12,461 కోట్లు
- దేశవ్యాప్తంగా 88,500 ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు
- మిషన్ మౌసమ్ కోసం రూ.2వేల కోట్లు
- కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు

2 లో

## కబ్జాదారులూ.. ఖబడ్దార్..





- మర్యాదగా ఖాళీ చేయండి
- జల వనరులకు విముక్తి కల్పించండి
- లేదంటే మేమే కూలగొడతాం
- ఆక్రమణదారులు ఎంతటివారైనా వదలం
- కబ్జాకోరులకు సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్

**వారధి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో చెరువులు, కుంటలు, నాలాలు కబ్జాచేసిన వారికి సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. ఆక్రమణదారులు తామంతట తామే అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని, లేనిపక్షంలో హైడ్రా రంగంలోనిదిగి వారి భరతం పడుతుందని ఆయన స్పష్టంచేశారు. ఆక్రమణదారులు ఎంత పెద్దవారైనా వదలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీలో జరిగిన పోలీస్ పాసింగ్ పరేడ్‌కు ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరు పెద్దలు ప్రాజెక్టుల వద్ద అక్రమంగా ఫాంహౌస్‌లు కడుతున్నారని అన్నారు. ఆ ఫాంహౌస్‌ల నుంచి డ్రైనేజీ నీటిని హైదరాబాద్ నగరానికి మంచి నీటిని అందించే గండిపేట లాంటి జలాశయాల్లోకి వదులుతున్నారని చెప్పారు. దీనివల్ల నగరవాసులు అనేక వ్యాధుల బారిన పడుతున్నారని సీఎం తెలిపారు. ఇక నాలాల దురాక్రమణ వల్ల వచ్చే వరదలతో అనేక ప్రాంతాలు ముఖ్యంగా పేదలు, మధ్య తరగతి వర్గాల ప్రజలు నివసించే ప్రాంతాలు నీటి మునుగుతున్నాయని చెప్పారు. ఇలాంటివి ఇక తాము సహించబోమని, కబ్జాదారులు తన మాటలు పెడచెవిన పెడితే శిక్షించడానికి హైడ్రా సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. కూల్చివేలపై స్టే తెచ్చుకున్నా తాము కోర్టులో కొట్లాడి విజయం సాధిస్తామని ఆయన తెలిపారు.


త్వరలో మూసీ ప్రక్షాళన

త్వరలో మూసీ ప్రక్షాళనకు శ్రీకారం చుడతామని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో నివాసాలు ఏర్పరచుకున్న నిరుపేదలకు న్యాయం చేస్తామని, వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని చెప్పారు. అందుకు భిన్నంగా తమ ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాల వారికీ న్యాయం చేస్తోందని తెలిపారు. తాము అధికారంలోకి రాగానే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. మరో 35 వేల ఉద్యోగాలు నోటిఫికేషన్లు ఇచ్చామని ఆయన తెలిపారు. ప్రజల జీవితాలను పీల్చి పిప్పి చేస్తున్న నేరాల పట్ల పోలీసులు

2 లో

## హైదరాబాద్ ఇమేజ్‌కు డ్యామేజ్

- హైడ్రా పేరుతో నగరాన్ని హత్య చేసిన రేవంత్ సర్కార్
- రియల్ ఎస్టేట్ మార్కెట్లు ఢమాల్
- సగం మందికే రైతు రుణమాఫీ
- మ్యానిఫెస్టోలో చెప్పినవన్నీ బూటకాలే
- కేంద్రం, రాష్ట్రం దొందూ దొందే
- మాజీ మంత్రి హరీష్‌రావు సంచలన వ్యాఖ్యలు



**వారధి న్యూస్, హత్నూర్:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా పేరుతో హైదరాబాద్‌ని హత్య చేశారని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు. బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌కి ప్రపంచ స్థాయి బ్రాండ్ ఇమేజ్ ఉండేదని.. కానీ, రేవంత్ రెడ్డి పాలనలో ఇమేజ్ పడిపోయిందని అన్నారు. రియల్ ఎస్టేట్ మార్కెట్ పడిపోయి,

2 లో



## భూనిర్వాసితులకు సత్వర సాయం

- పరిహారం, ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలి
- మార్చి నాటికి యాదాద్రిలో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2 లో

## వరదలతో తెలంగాణకు భారీ నష్టం

- వేలాది మంది నిరాశ్రయులయ్యారు
- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్
- హోం మంత్రి అమిత్‌షాకు వరద నష్టంపై నివేదిక అందజేత

**వారధి న్యూస్, న్యూఢిల్లీ**



తెలంగాణలో జరిగిన వరద నష్టాన్ని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వివరించారు. బుధవారం న్యూడిల్లీలో తెలుగు రాష్ట్రాల వరద నష్టానికి సంబంధించిన ప్రాథమిక నివేదికను హోం మంత్రి అమిత్ షాకు అందజేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు.
ఎడ తెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో తెలంగాణలో పలు ప్రాంతాల్లో వరద పోటెత్తింది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. పలు కాలనీలు, పంట పొలాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. పదుల సంఖ్యలో మరణాలు

2 లో




## కోల్‌కతా డాక్టర్ల కొత్త డిమాండ్

- సీఎంతో మమతతో సమావేశం లైవ్ టెలికాస్ట్‌కు డిమాండ్
- 30 మందిని ప్రతినిధులకు అవకాశమివ్వాలని సూచన
- 33 రోజులుగా కొనసాగుతున్న ప్రతిష్ఠంభన

**వారధి న్యూస్, కోల్‌కతా:**

ఆర్జీకర్ ఆసుపత్రి ఘటనపై జూనియర్ డాక్టర్ల నిరసనతో తలెత్తిన ప్రతిష్ఠంభన 33వ రోజైన బుధవారం నాడు కూడా తొలగలేదు. చర్చలకు రావాలంటూ ప్రభుత్వం ఆహ్వానించడాన్ని స్వాగతిస్తూనే మరిన్ని కొత్త డిమాండ్లు తెరపైకి తెచ్చారు డాక్టర్లు. ప్రతిపాదిత సమావేశానికి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తప్పనిసరిగా హాజరుకావాలని,

2 లో

## త్వరలో మంత్రివర్గ విస్తరణ..?

- నేడు ఏఐసీసీ పెద్దలతో సీఎం రేవంత్ భేటీ
- కొత్త మంత్రుల నియామకంపై చర్చ
- ఢిల్లీ నుంచి తిరిగి రాగానే కీలక నిర్ణయం
- రేసులో ఆరుగురు కీలక నేతలు



2 లో

## కౌశిక్ రెడ్డి.. నోరు జాగ్రత్త..
## ఎక్కువ మాట్లాడితే చెప్పు దెబ్బలే

- మహిళలు చేతకాని వాళ్లా..?
- చీరలు, గాజులు పంపి అవమానిస్తావా
- రాజకీయాల్లో ఇలాంటి పద్ధతి సరికాదు
- పాడిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయాలి
- మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి



**వారధి, స్టేట్ బ్యూరో:**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి చెప్పు దెబ్బలు తప్పవని కాంగ్రెస్ మహిళా నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై కౌశిక్ రెడ్డి సంచలన విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. ఆ ఎమ్మెల్యేలకు చీర, గాజులు పంపుతున్నట్లుగా ప్రకటించారు. వారంతా ఆ చీర గాజులు వేసుకుని పబ్లిక్‌లో తిరగాలని సూచించారు. వారికి ఇజ్జత్ లేదని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలు ప్రస్తుతం వివాదాస్పదంగా మారాయి. పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉన్నాయని కాంగ్రెస్ మహిళా నేతలు మండిపడ్డారు. బుధవారం గాంధీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ మారిన వారికి చీర, గాజులు పంపడం అంటే ఏమిటని.. మహిళలను చేతకాని వాళ్లుగా చెబుతున్నారా అని ప్రశ్నించారు. మహిళల్ని కించ పరిచేలా మాట్లడితే చెప్పుదెబ్బలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి పాడి కౌశిక్ రెడ్డికి షూ చూపించారు. రాజకీయాల్లో మహిళలను అవమానించే పద్ధతి మంచిది కాదని.. తెలంగాణ ఉద్యమంలో మహిళలు ముందుండి ఉద్యమాన్ని నడిపించారని గుర్తు చేశారు. మరోసారి కించ పరిచేలా చీర గాజులు చూపిస్తే చెప్పు దెబ్బలు తప్పవని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలకు ఇది మొదటి సారి కాదని పదే పదే మహిళల్ని కించపరిచేలా మాట్లాడుతున్నారని అందుకే.. చెప్పు చూపించాల్సి వచ్చిందని కాంగ్రెస్ మహిళా నేతలు స్పష్టం చేశారు. పాడి కౌశిక్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయాలని.. మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుని విచారణ చేయాలని డిమాండ్ చేశారు. పాడి కౌశిక్ రెడ్డికి పాడె ఎక్కే సమయం వచ్చిందని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత మండిపడ్డారు. భార్య, కుమార్తెలతో ఆత్మహత్యలు చేసుకుంటానని బెదిరించి కౌశిక్ రెడ్డి గెలిచారడన్నారు. పాడి కౌశిక్ రెడ్డి దరిద్రపు గొట్టు చరిత్ర అందరికీ తెలుసన్నారు. క్షమాపణలు చెప్పే వరకూ మహిళలతో నిరసనలు నిర్వహించాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇంతకు ముందు కేటీఆర్ కూడా మహిళలకు ఉచిత బస్సు విషయంలో చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఆయనను మహిళా కమిషన్ పిలిపించి వివరణ తీసుకుంది. ఇప్పుడు కౌశిక్ రెడ్డి కూడా అలా మాట్లాడటంతో బీఆర్ఎస్ పార్టీకి ఇబ్బందికరంగా మారింది.



## పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇజ్జత్ లేనోళ్లు..!

- చీర కట్టుకొని, గాజులు వేసుకోండి
- అసలు మీకు సిగ్గు, శరం లేదా..?
- దానం బిచ్చగాడు, చీటర్
- కడియం శ్రీహరి పచ్చి మోసగాడు
- అరికెపూడి గాంధీ.. నకిలీ గాంధీ
- పార్టీ మారకపోతే తెలంగాణ భవన్‌కు రా
- దమ్ముంటే ఉప ఎన్నికలు ఎదుర్కోండి
- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**వారధి, స్టేట్ బ్యూరో:**

అసెంబ్లీ ఎన్నికలు తరువాత బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ సెక్రటరీకి ఇచ్చారు. తమ పిటిషన్‌పై స్పీకర్

2 లో

# బైక్ ప్రమాదంలో వ్యక్తి మృతి



**వారధి న్యూస్,నాంపల్లి :** మండలంలోని నేరళ్ల పల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఆక రామస్వామి అంత్యక్రియలకు హాజరైన చండూరు మండలానికి చెందిన పోలే రామ శంకర్, తన తండ్రి శ్రీను కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో తన బైక్ పై పుల్లెంల గ్రామానికి తిరిగి వెళ్తుండగా, నేరళ్లపల్లి గ్రామ శివారులో ములుపు వద్ద అదుపు తప్పాడు. దీంతో బైక్ రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడిపోయింది. ఈ ప్రమాదంలో రామ శంకర్ తలకు తీవ్ర గాయం అయ్యి అక్కడికక్కడే మరణించాడు. మృతుడి తండ్రి పోలే శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# పోషణమాసం పౌష్టికాహార అవగాహన కార్యక్రమం

**వారధి న్యూస్, మిర్యాలగూడ :** ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పోషణమాసం సందర్భంగా, సీడీపీఓ ఆర్.మమత ఆధ్వర్యంలో ఇస్లాంపురం సెక్టార్ పరిధిలోని ఈదులగూడెం అంగన్వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో, పిల్లలకు కథల పుస్తకాలను అందించి, కథల పుస్తకాలలోని చిత్రాల సహాయంతో కథలను చదవడం, అక్షరాలను గుర్తించడం, శబ్దాలను అనుసరణ, పునరావృత పదాల గుర్తింపు, మరియు కథల ఆధారంగా పిల్లలతో చర్చించడం నిర్వహించారు. అదేవిధంగా, గర్భిణీ బాలింతలకు పౌష్టికాహార ప్రాముఖ్యత గురించి అవగాహన కలిగించారు. ఆకుకూరలు, కూరగాయలు, మరియు అంగన్వాడీ కేంద్రాల్లో లభించే పౌష్టికాహార పదార్థాల గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ముదిరెడ్డి నర్సిరెడ్డి, చల్లా వెంకన్న, లయన్స్ క్లబ్ సభ్యులు బిఎమ్. నాయుడు, సూపర్వైజర్ నజీమా బేగం, అంగన్వాడీ టీచర్ బొందు పార్వతి, రామానుజమ్మ, లలితమ్మ, రజిత, మరియు హెల్పర్లు జి.లక్ష్మి, వి.లక్ష్మి, క.పార్వతమ్మ పాల్గొన్నారు.

# కబ్జాదారులూ.. ఖబడ్దార్..

తురువాయి భాగం


అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

**డ్రగ్స్ పేరెత్తితే వెన్నులో వణుకు పుట్టాలి..**

పోలీసు శాఖలో పనిచేయడమంటే ఉద్యోగం కాదని, నాలుగుకోట్ల మంది తెలంగాణ ప్రజల భావోద్వేగమని అన్నారు. త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ ఈ రాష్ట్రం నుంచి గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలను పారదోలేందుకు ప్రతి పోలీసూ కంకణబద్ధులు కావాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పోలీసు ఉద్యోగమంటే సమయం, సందర్భం ఉండవని, వరదలొచ్చినా.. భూకంపమైనా.. ఆర్థిక నేరాలు జరిగినా ముందుండి పోరాటం చేయడమేనని అన్నారు. భవిష్యత్ తరాలకు బాటలు వేసేలా విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు. గంజాయి, డ్రగ్స్ మాట ఎత్తాలంటేనే వెన్నుల్లో వణుకు పుట్టాలని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది నేరస్తుల విషయంలో కాదని, బాధితుల పట్ల స్నేహపూర్వకంగా మెదులుకోవాలని కోరారు. కాస్మోటిక్ పోలీసింగ్.. కాంక్రీట్ పోలీసింగ్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

# వరదలతో తెలంగాణకు భారీ నష్టం

తురువాయి భాగం



సంభవించాయి. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. దాంతో వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు.ఈ నేపథ్యంలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వరద బాధిత ప్రాంతాల్లో స్వయంగా పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. వరద నష్టంపై ఉన్నతాధికారులు కేంద్ర మంత్రికి నివేదిక అందజేశారు.

మరోవైపు తెలుగు రాష్ట్రాల్లో వరద సాయం కింద రూ.3,300 కోట్ల తక్షణ సాయన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ సాయాన్ని వెంటనే విడుదల చేస్తున్నట్లు తెలిపింది. ఇంకోవైపు ఈ వరద విపత్తుపై వివిధ ఉద్యోగ సంఘాలు సైతం స్పందించాయి. టాలీవుడ్ పరిశ్రమకు చెందిన పలువురు నటీనటులు సైతం భారీగా ఆర్థిక సాయాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే.

# 1284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు

వారధి, స్టేట్ బ్యూరో:

ఆరోగ్య శాఖలోని పబ్లిక్ హెల్త్, తెలంగాణ వైద్య విధాన పరిషత్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలలో 1284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను సర్కార్ భర్తీ చేయనున్నది. ఈ మేరకు బుధవారం బోర్డు కార్యదర్శి గోపికాంత్ రెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 21 నుంచి అక్టోబర్ 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. నవంబరు 10న కంప్యూటర్ బేస్ట్ టెస్ట్ నిర్వహించనున్నారు. అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలు, తప్పిదాలు ఉంటే అక్టోబర్ 5 నుంచి 7 వరకు దరఖాస్తుల్లో ఎడిట్ ఆప్షన్ ఇవ్వనున్నారు. వచ్చిన అప్లికేషన్లను బట్టి పరీక్షల సెషన్స్ ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు.

అయితే, ఇంగ్లీష్ మీడియంలో మాత్రమే పరీక్ష ఉండనున్నది. ఇక ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే వాళ్లకు వెయిటేజ్ మార్కులు ఇవ్వనున్నారు. ఇందుకోసం ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికేట్స్ జత చేయాల్సి ఉంటుంది. తెలంగాణ పారామెడికల్ బోర్డులో తమ విద్యార్హత ధ్రువ పత్రాలను రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి అని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. అభ్యర్థులు ఈ ఏడాది జూలై 1 నాటికి 46 సంవత్సరాలకు మించి ఉండకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు ఐదేళ్ల వయోపరిమితి సడలింపు ఇచ్చారు. దివ్యాంగులకు పదేళ్లు ఇచ్చారు. ఎన్సీసీ, ఎక్స్ సర్వీస్ మెన్‌లకు మూడేళ్లు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు(ఆర్టీసీ, మునిసిపల్ ఉద్యోగులు అనర్హులు) ఐదేళ్ల వయోపరిమితిని సడలింపునిచ్చారు. పోస్టుల్లో 95 స్థానికులకేనని స్పష్టం చేశారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు తెలంగాణలో చదివిన వారే స్థానికులని పేర్కొన్నారు. ఒకవేళ ఒకటి నుంచి ఏడు వరకు ఇక్కడ చదవకుంటే, తెలంగాణ స్థానికతపై ప్రభుత్వం జారీ చేసే ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. వంద పాయింట్ల ప్రాతిపదికన ఎంపిక జరగుతుండగా, 80 మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. మిగిలినవి వెయిటేజ్ కింద ఎంపిక చేస్తారు. హైదరాబాద్, నల్గొండ, కోదాడ, ఖమ్మం, కొత గూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్ నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట పట్టణ కేంద్రాల్లో ఎగ్జామ్ నిర్వహించనున్నారు.

# వయో వృద్ధులకూ ఆరోగ్య బీమా




వారధి న్యూస్, న్యూఢిల్లీ

కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో అమలవుతున్న ఆయుష్మాన్ భారత్ విషయంలో మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై దేశంలో 70 ఏళ్లు పైబడిన ప్రతి వ్యక్తికి ఆయుష్మాన్ భారత్ పథకం వర్తించనుంది. వారు కూడా ఇకపై ఆయుష్మాన్ భారత్ పరిధిలోకి వస్తారని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం తెలిపారు. ఈ ఆయుష్మాన్ భారత్ వల్ల రూ.5 లక్షల వరకు ఉచిత చికిత్స అందించనున్న సంగతి తెలిసిందే. తాజా నిర్ణయం కారణంగా 6 కోట్ల మంది సీనియర్ సిటిజన్లు, 4.5 కోట్ల కుటుంబాలకు ఈ ప్రయోజనం చేకూరుతుందని కేబినెట్ బ్రీఫింగ్ సందర్భంగా అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. ఇప్పటికే ఈ పథకం కింద ఉన్న కుటుంబాలు వారి కుటుంబాల పెద్దలకు రూ.5 లక్షల అదనపు కవరేజీని పొందుతారని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం ఆమోదంతో లబ్ధిదారుల సామాజికఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా 70 ఏళ్లు, అంతకంటే వయస్సు పైబడిన సీనియర్ సిటిజన్లు అందరూ ఆయుష్మాన్ భారత్ ప్రయోజనాలను పొందేందుకు అర్హులని ఆయన తెలిపారు. అర్హులైన సీనియర్ సిటిజన్లకు ఈ పథకం కింద ఇకపై కొత్తగా ప్రత్యేకంగా ఓ కార్డు జారీ చేస్తామని తెలిపారు. ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ కింద కవర్ అయిన కుటుంబాల నుంచి 70 ఏళ్లు, లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న సీనియర్ సిటిజన్‌లు ఏడాదికి రూ.5 లక్షలదాకా అడిషనల్ టాప్‌అప్ కవర్ పొందుతారు.

**మరో 5 కీలక నిర్ణయాలు**

దీంతో పాటు కేంద్ర మంత్రివర్గ సమావేశంలో మరో 5 కీలక నిర్ణయాలు కూడా తీసుకున్నారు. జల విద్యుత్ ప్రాజెక్టులకు మౌలిక సదుపాయాలను కల్పించే విషయంలో సవరణలు చేశారు. 31,350 మెగావాట్ల జలవిద్యుత్ ప్రాజెక్టుల కోసం కూడా రూ.12,461 కోట్ల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశంలో ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెంచేందుకు రూ.10,900 కోట్లతో పీఎం ఈడ్రైవ్ అనే పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. దీని సాయంతో దేశవ్యాప్తంగా 88,500 ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుంది. అలాగే పీఎం ఈ బస్, పేమెంట్ సెక్యూరిటీ మెకానిజం కోసం రూ.3,435 కోట్లు కేటాయించింది. వాతావరణ శాఖకు మరింత టెక్నాలజీ అందించడం, నెక్స్ట్ జనరేషన్ రాడార్స్ శాటిలైట్లను ఉపయోగించడం కోసం మిషన్ మౌసమ్ (వాతావరణం) కోసం రూ.2వేల కోట్లు కేటాయించింది. హై పెర్ఫామెన్స్ కంప్యూటర్లను కూడా వినియోగించనుంది.




# కోల్‌కతా డాక్టర్ల కొత్త డిమాండ్

తురువాయి భాగం

ఈ సమావేశాన్ని లైవ్ టెలికాస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మమతా బెనర్జీ హాజరవుతున్నారో లేదో ధ్రువీకరించాలని అధికారులను కోరారు. దీనికి ముందు వైద్యులు విధుల్లోకి చేరాలంటూ సుప్రీంకోర్టు మంగళవారం సాయంత్రం 5 గంటలకు వరకూ గడువు ఇచ్చినప్పటికీ వారు విధుల్లోకి చేరడానికి నిరాకరించారు. జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, న్యాయం జరిగేంత వరకూ విధుల్లోకి వచ్చేది లేదని తేల్చిచెప్పారు. ఈ క్రమంలో వారికి చీఫ్ సెక్రటరీ ఆహ్వానం పంపారు. సెక్రటేరియట్ లో జరిగే సమావేశానికి 12 నుంచి 15 మంది వైద్య ప్రతినిధుల బృందం రావాలని కోరారు. అయితే తాము చేసిన డిమాండ్లలో చీఫ్ సెక్రటరీ రాజీనామా చేయాలనే డిమాండ్ కూడా ఉన్నప్పుడు ఆయనతో ఆహ్వానం పంపడం ఏమిటని వైద్యులు నిలదీశారు. సమావేశానికి తాము హాజరవ్వాలా వద్దా అనే నిర్ణయం తీసుకునే ముందు తమకు కొన్ని పాయింట్లపై స్పష్టత కావాలన్నారు. పలు డిమాండ్ల ప్రభుత్వం ముందు పెట్టారు. నిరసనల్లో పలు అసోసియేషన్లు, ఆసుపత్రులకు చెందిన వైద్యులు, విద్యార్థులు పాల్గొంటున్నందున కనీసం 30 మంది ప్రతినిధులకు సమావేశంలో పాల్గొనే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సమక్షంలోనే సమావేశం జరగాలని, అది కూడా లైవ్ టెలికాస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



# పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇజ్జత్ లేనోళ్లు..!

తురువాయి భాగం

చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఉప ఎన్నికలు వస్తాయని తెలిసి పార్టీ మారిన ఎమ్మెల్యేలు గజగజ వణుకుతున్నారని అన్నారు. పూటకో పార్టీ మారే దానం నాగేందర్ బిచ్చగాడు, చీటర్, శాశ్వతంగా మాజీ ఎమ్మెల్యేగా మిగిలిపోతాడని అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు సిగ్గు, శరం లేదా? అని ప్రశ్నించారు. వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కడియం శ్రీహరి పచ్చి మోసగాడు, పొద్దున కేసీఆర్ దగ్గర బ్యాగులు తీసుకొని వెళ్లి సాయంత్రం కాంగ్రెస్ పార్టీలో చేరాడని మండిపడ్డారు. కడియం శ్రీహరి స్టేషన్ ఘన్ పూర్‌లో డిపాజిట్ తెచ్చుకోవాలని అన్నారు. అరికెపూడి గాంధీ నేను కాంగ్రెస్ కండువా కప్పుకోలేదు అంటున్నారని.. నేను దేవుడు కండువా కప్పుకున్నానని అంటున్నారని అన్నారు. కాంగ్రెస్‌లో చేరానని గాంధీయే స్వయంగా మీడియాకు చెప్పి ఇపుడు మాట మారుస్తున్నారని ఫైర్ అయ్యారు.

**దమ్మొంటే ఉప ఎన్నికలకు రండి..**

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు దమ్మొంటే స్పీకర్ నిర్ణయం దాకా ఆగకుండా రాజీనామా చేసి ఉపఎన్నికలను ఎదుర్కోవాలని అన్నారు. ఎపుడు ఎన్నికలు వచ్చినా ఆ పది సీట్లు బీఆర్ఎస్ గెలుస్తుందని అన్నారు. అరికెపూడి గాంధీ నకిలీ గాంధీ అని చురకలు అంటించారు. కేసీఆర్ విడిగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్నారని నిరూపిస్తే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని అన్నారు. అరికెపూడి గాంధీ మా పార్టీ సభ్యుడు అయితే తెలంగాణ భవన్‌కు రావాలని సవాల్ చేశారు. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలకు చీర, గాజులు గిఫ్టుగా పంపుతున్నా.. ఇవి వేసుకుని తిరగండి అంటూ విమర్శలు గుప్పించారు.

# డబుల్ సెంచరీ దాటిన కూల్చివేతలు

**111.72 ఎకరాల స్థలం పరిరక్షణ**
**సర్కారుకు నివేదిక అందజేసిన హైడ్రా**

వారధి, స్టేట్ బ్యూరో:

తెలంగాణలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు హైడ్రా రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆక్రమణదారుల నుంచి ఇప్పటి వరకు వంద ఎకరాలకుపైగా ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. 23 ప్రాంతాల్లో 262 అనధికారిక నిర్మాణాలను కూల్చివేసి 111.72 ఎకరాల స్థలాన్ని పరిరక్షించినట్లు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. గత రెండు నెలలుగా చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాల పనిపడుతున్న హైడ్రా, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను ఎక్కడా ఉపేక్షించకుండా నేలమట్టం చేస్తోంది. రాంనగర్ మణెమ్మ గల్లీలో 3, గగన్ పహాడ్ అప్పా చెరువులో 14, అమీన్‌పూర్ పెద్ద చెరువు పరిధిలో 24, మాదాపూర్ సున్నం చెరువులో 42, దుండిగల్ కత్వా చెరువు పరిధిలో 13 అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసినట్లు హైడ్రా తెలిపింది. అత్యధికంగా అమీన్‌పూర్‌లో 51 ఎకరాలు, మాదాపూర్ సున్నం చెరువులో 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా వివరించింది.

# భూనిర్వాసితులకు సత్వర సాయం

వారధి న్యూస్, మిర్యాలగూడ:



యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు సత్వరమే సాయమందించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. భూసేకరణ నిధులతో పాటు, ప్రాజెక్టు పనుల్లో ఉపాధి కల్పించాలని తెలిపారు. బుధవారం నాడు యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణంలో పురోగతిని ఆయన సమీక్షించారు. రాబోయే మార్చి 31 నాటికి అన్ని యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభిస్తామని ప్రకటించారు.

ఈ సంవత్సరం డిసెంబర్ నాటికి 2400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 3 యూనిట్ల ఉత్పత్తి ప్రారంభిస్తామన్నారు. మొత్తం 4000 మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా ఉందన్నారు. సివిల్ పనులు, రైల్వే పనులు, బొగ్గు రవాణా వంటి అవసరాలకు ప్రత్యేక రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు.

గత ప్రభుత్వ చిత్తశుద్ధి లోపం వల్ల ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యమైందని, ఉత్పత్తి వ్యయాలు పెరిగాయని, తమ ప్రభుత్వం సమీక్షలు నిర్వహించి ప్రాజెక్టు పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..వైటీపీఎస్, పులిచింతల ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని చెప్పిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు. పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణ పనులను వేగవంతం చేస్తామన్నారు. భూములు ఇచ్చిన వారి వివరాలు రూపొందించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. చిన్న చిన్న కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్లు, ఇంజనీర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ఇమేజ్‌కు డ్యామేజ్

తురువాయి భాగం

రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయని చెప్పారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ విద్యార్థులకు మంచి సౌకర్యాలు అందించేవారని, కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒక్క జత బట్టలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో తిరుగలేని పరిస్థితుల్లో ఉన్నారని, పార్టీ మ్యానిఫెస్టోలో చెప్పినవన్నీ భూటకాలేనని అన్నారు. రైతు రుణమాఫీ పూర్తిగా అవలేదని, రైతు భరోసాను ఎగ్గొట్టారని అన్నారు. రైతుబంధు నిధులను కోతలు లేకుండా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**కేంద్రం, రాష్ట్రం దొందూ దొందే..**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు "దొందు దొందే" అని హరీష్ రావు విమర్శించారు. 8 మంది ఎంపీలను గెలిపిస్తే తెలంగాణకు కేంద్ర బడ్జెట్ లో గుండు సున్నాలు కేటాయించారని, ఆంధ్రకు ప్యాకేజీల మీద ప్యాకేజీలు ప్రకటించారని ఎద్దేవా చేశారు.

ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, బీఆర్ఎస్ నర్సాపూర్ నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# త్వరలో మంత్రివర్గ విస్తరణ..?

- నేడు ఏఐసీసీ పెద్దలతో సీఎం రేవంత్ భేటీ
- కొత్త మంత్రుల నియామకంపై చర్చ
- ఢిల్లీ నుంచి తిరిగి రాగానే కీలక నిర్ణయం
- రేసులో ఆరుగురు కీలక నేతలు

వారధి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఈ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీని రేవంత్ కలవనున్నారు. ఈ మేరకు ఇప్పటికే సీఎంఓ ప్రధాన మంత్రి కార్యాలయాన్ని స్పంద్రించింది. పీఎం అపాయింట్మెంట్‌ను కోరింది. మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులను సైతం ఈ పర్యటనలో సీఎం కలవనున్నారు. తెలంగాణలో జరిగిన వరద నష్టంపై నివేదిక సమర్పించనున్నారు. అనంతరం రాష్ట్రానికి ఆర్థిక సాయం చేయాలని కోరునున్నారు. రేవంత్‌తో పాటు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సైతం ఢిల్లీకి వెళ్తున్నారు. అయితే.. సోనియాగాంధీ అపాయింట్‌మెంట్‌ను సైతం రేవంత్ కోరినట్లు తెలుస్తోంది. పీసీసీ చీఫ్ నియామకం పూర్తి కావడంతో నెక్స్ట్ మంత్రివర్గ విస్తరణపై సీఎంతో పాటు కాంగ్రెస్ హైకమాండ్ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఈ పర్యటనలో మంత్రివర్గ విస్తరణకు సంబంధించిన జాబితాను ఖరారు చేసుకుని సీఎం వస్తారన్న ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం మంత్రివర్గంలోకి మరో ఆరుగురిని తీసుకునే అవకాశం ఉంది. వాకిటి శ్రీహరి ముదిరాజ్, పి.సుదర్శన్ రెడ్డి, గడ్డం వివేక్‌కు మంత్రివర్గంలో చోటు దాదాపు ఖరారైనట్లు కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మంత్రి పదవి కోసం జోరుగా ప్రచారం చేస్తున్నారు. వీరితో పాటు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సైతం తనకు కేబినెట్ లో ఛాన్స్ పక్కా అన్న ధీమాతో ఉన్నారు. బీజేపీ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చే సమయంలో తనకు మంత్రి పదవిపై కాంగ్రెస్ హైకమాండ్ హామీ ఇచ్చిందని.. విస్తరణలో తనకు చోటు తప్పనిసరిగా దక్కుతుందని ఆయన అనుచరుల వద్ద వ్యాఖ్యనిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మైనార్టీ నుంచి మంత్రివర్గంలో ఇంత వరకు చోటు దక్కలేదు. దీంతో ఈ కోటాలో షబ్బీర్ అలీ, అజారుద్దీన్‌లో ఒకరు లేదా ఇద్దరికీ ఛాన్స్ దక్కే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది.

వారధి
తెలుగు దిన పత్రిక
www.vaaradhinews.com
GENERAL NEWS
జనరల్ న్యూస్



## ఘనంగా అటవీ శాఖ అమరవీరుల దినోత్సవం

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** అచ్చంపేట పట్టణంలో బుధవారం అటవీశాఖ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా అటవీశాఖ సిబ్బంది పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు అనంతరం డి.ఎఫ్.ఓ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన అమర అటవీరుల స్మారక స్తూపం వద్ద స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పూలమాలలు వేసి అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే అమరాబాద్ నల్లమల్ల అటవీ ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉందని ప్రత్యేకతను కాపాడడంలో సిబ్బంది నిర్విరామంగా పనిచేస్తున్నారని అన్నారు నల్లమల్ల అడవుల్లో పెద్ద పులులు గణనీయంగా పెరగడం వాటికి తోడు చిరుతపులుల సంఖ్య పెరగడం అభినందనీయమన్నారు పర్యావరణ పరిరక్షణలో అటవీశాఖ సిబ్బంది ముందు ఉన్నారని వారు మరింత ముందుకు వెళ్లి పర్యావరణ పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు కార్యక్రమంలో డిఎఫ్ఓ రోహిత్ గోపిడి స్థానిక అటవీశాఖ రేంజ్ అధికారులు, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.





## ప్రతి మండల కేంద్రంలో ఒక ఎడ్యుకేషనల్ హబ్‌ను ఏర్పాటు చేస్తాం

- ఎమ్మెల్యే తూడి మెఘా రెడ్డి
- విద్యార్థుల విద్యా అభివృద్ధి పై వహిస్తాం
- విద్యార్థులు క్రీడలలో రాణించడానికి కృషి చేస్తాం.
- కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట

**వారధి న్యూస్ పెబ్బేరు:** తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక గత ప్రభుత్వ పాలనలో పదేళ్లపాటు విద్యా వ్యవస్థ నిర్వీర్యం అయిందనీ బుధవారం పాఠశాల స్థాయి విద్యార్థుల క్రీడల పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏం ఎల్ ఏ తూడి మేఘారెడ్డి అన్నారు. పెబ్బేరు మండల కేంద్రంలో చేపట్టిన పలు కార్యక్రమాలకు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి తోపాటు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడతూ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి మండల కేంద్రంలో ఒక ఎడ్యుకేషన్ ఇంటిగ్రేటెడ్ హబ్ ను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంతర్జాతీయ క్రీడాకారిణి సౌమ్యను వారు సన్మానించారు. వారు మాట్లాడుతూ రానున్న కాలంలో ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని క్రీడలతోనే ఉన్నత స్థాయి గుర్తింపు వస్తుందని ఆయన అన్నారు. అంతకుముందు జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని 56 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కరుణశ్రీ సాయినాథ్, వైస్ చైర్మన్ కర్ర స్వామి,తహసిల్దార్ లక్ష్మి, ఎంపీడీవో రవీంధ్ర, ఎంఈఓ జయరాములు, హై స్కూల్ హెచ్ ఎం రఘు వర్ధన్, కౌన్సిలర్లు అక్కమ్మ, పార్వతి మహేందర్ గౌడ్, సుమతి ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ గౌడ, వెంకటేష్, సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నల్లమల్ల లో గద్దర్ విగ్రహా విష్కరణకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం శ్రీశైలంహైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూరు గ్రామంలో దివంగత కవి గాయకులు ప్రజా యుద్ధనౌక గద్దర్ విగ్రహం ఏర్పాటు కోసం బుధవారం ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమం లో ప్రముఖ సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, కవి గాయకులు ఏపూరి సోమన్న , యురేరియం వ్యతిరేక జేఏసీ కన్వీనర్ కలుముల నాసరయ్య, ఇతర ప్రముఖులు స్థానిక నాయకులు గద్దర్ అభిమానులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన దినోత్సవ ముఖ్య అతిథి డాక్టర్ చిన్నారెడ్డి

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో** సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.ఈ కార్యక్రమానికి నాగర్ కర్నూలు జిల్లా కు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి చిన్నారెడ్డి ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.నాగర్ కర్నూలు జిల్లాలో నిర్వహించే కార్యక్రమానికి హాజరై జాతీయ పతాకావిష్కరణ ను ఆయన చెయ్యనున్నారు.

## స్త్రీ ఆరోగ్య సమస్యల పై అవగాహన కార్యక్రమం

**వారధి న్యూస్ మహబూబ్ నగర్.** మహబూబ్ నగర్ జిల్లా లోని స్థానిక ఎం.వి.ఎస్. ప్రభుత్వ ఆర్ట్స్& సైన్స్ కలాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఈరోజు కళాశాల విద్యార్థినులకు స్త్రీ సంబంధిత ఆరోగ్య సమస్యలు పరిష్కార మార్గాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. టీనా సంతాన సాఫల్య కేంద్రం నిర్వహిస్తున్న డాక్టర్ నితీష ప్రస్తుతం మహిళలు ఎక్కువగా ఎదుర్కొంటున్న పిసిఒడి, సంతానలేమి, నెలసరి సమస్యలు మొదలగు అనేక అంశాలను అలవోకగా విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో కలాశాల ప్రిన్సిపల్ డా.పద్మావతి గారు పాల్గొన్నారు.ఇదే కార్యక్రమంలో మహిలా



సాధికారిత సెల్ కన్వీనర్ డా. సరితా రాణి, డా. కె.సుభాశిని ,డా. విద్యారాణి, డా. ఎన్. సుభాశిని,డా. స్వప్న ,డా. స్వరూప,డా.మంజుల , డా.ఉమా,పి. భీమేశ్వరి మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.





## కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ

- కలెక్టర్ బాదవత్ సంతోష్

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** నాగర్ కర్నూల్ మండలంలోని నాగనూల్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్‌బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పనితీరును, ఉపాధ్యాయుల బోధన గూర్చి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి క్లాస్‌రూమ్‌లోకి వెళ్లి విద్యార్థుల పరిజ్ఞానాన్ని పరిశీలించారు.కేజీబీవీ లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకోరావాలని విద్యార్థులను కలెక్టర్ కోరారు. కేజీబీవీ పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వతో జమ్మూపిచ్చి మొక్కలు మొలవడం పాములు సంచరిస్తున్నాయని విద్యార్థినిలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ విద్యార్థినిల తో కలసి కేజీబీవీ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అందుకు కావలసిన మరమ్మత్తుల చర్యలను అధికారులతో మాట్లాడి పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. మరుగుదొడ్లు వినియోగానికి నీటి వసతి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రత్యేక అధికారిని ఆదేశించారు. వంటగదిని కలెక్టర్ పరిశీలించి వంట మనుషులతో మాట్లాడారు. విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలు అత్యంత పరిశుభ్రంగా వండి వడ్డించాలని కలెక్టర్ వంట మనుషులకు ఆదేశించారు. ఇటీవలే పెంట్లవెల్లి కేజీబీవీలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వంట మనుషులను విధులనుంచి తొలగించిన విషయాన్ని కలెక్టర్ వంట మనుషుల దృష్టికి తెచ్చారు. విద్యార్థుల విద్యార్థులకు అందించే కూరగాయలు బియ్యం నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని ప్రత్యేక అధికారి శోభారాణిని ఆదేశించారు.కేజీబీవీలో నెలకొన్నా సమస్యలను ప్రత్యేక అధికారిణి శోభారాణి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అవసరమైన మౌలిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

## ఐ.సి.ఐ.సి.ఐ ఫౌండేషన్ ప్రతినిధులను సన్మానించిన హన్వాడ ఎం.పి.డి.ఓ

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** హన్వాడ మండలం వివిధ గ్రామాల్లో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ, 16500 పళ్ళ మొక్కలను ఉచితంగా పంపిణీ చేసినందుకు ఐ.సి.ఐ.సి.ఐ ఫౌండేషన్ ప్రతినిధులు రాయుడు ప్రకాష్, రవి కుమార్, కిష్టయ్య, కృష్ణయ్యలను హన్వాడ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎం.పి.డి.ఓ), అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ (ఏ.పి.ఓ), వివిధ గ్రామాల పంచాయతీ సెక్రెటరీలు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ, పచ్చదనం పెంపుదలకు ఐ.సి.ఐ.సి.ఐ ఫౌండేషన్ చేస్తున్న కృషికి ప్రశంసించారు.





## ప్రతి ఒక్కరూ ధర్మ మార్గాన్ని అనుసరించాలి

- టంకరి శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ

**వారధి న్యూస్, మహబూబ్ నగర్ :** సహాయ ఫౌండేషన్ ఆధ్యాత్మిక పరిశోధకులు అయినటువంటి "శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామి సహాయ ఫౌండేషన్ జాతీయ ఆధ్యాత్మిక గౌరవ అధ్యక్షులుగా నియమించడం జరిగింది. అనంతరం "సహాయ ఫౌండేషన్" వ్యవస్థాపక అధ్యక్షులు "టంకరి శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామి ముఖ్య ఉద్దేశమైనటువంటి సత్య ప్రయాణం, మోక్ష గమ్యం, ధర్మ మార్గాలు.వంటి సలహా సూచనలు సమాజానికి అందిస్తూ సన్మార్గంలో నడిపిస్తున్నటువంటి "బిజ్వర్ గ్రామంలోని శ్రీ అంబత్రయ త్రిశక్తి పీఠం పీఠాధిపతి అయినటువంటి శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామి శాలువాతో సత్కరించి నియామక పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో "సహాయ ఫౌండేషన్" సభ్యులు కుర్మయ్య, సునీల్ హన్మంతు రావు కేశవ్ నాగరాజ్ దేవరాజు అషియన్ రికార్డు హోల్డర్ డాక్టర్.బస్వరాజ్ గారు తదితరులు పాల్గొన్నారు.



## ఔట్సోర్సింగ్ ఉద్యోగిని గొలుసుతో కట్టేసి దాడి

- రాజమ్మను తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్
- ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పి.సురేష్

**వారధి న్యూస్, మహబూబ్ నగర్ :** వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో అవుట్సోర్సింగ్ ఉద్యోగిని సుమలతపై అకారణంగా గొలుసుతో కట్టేసి దాడి చేసిన యూనియన్ లీడర్ రాజమ్మను తక్షణమే అరెస్టు చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పి.సురేష్ డిమాండ్ చేశారు.
ఈ ఘటనను నిరసిస్తూ మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. సురేష్ మాట్లాడుతూ, వైద్య కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందిని కొంతమంది స్వతంత్ర యూనియన్లు స్వార్థ ప్రయోజనాల కోసం ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఆర్థిక అరాచకాలతో పాటు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు.
ఈ దాడిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, దాడికి పాల్పడిన రాజమ్మను వెంటనే అరెస్టు చేసి, కాంట్రాక్ట్ సిబ్బందికి రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మెడికల్ యూనియన్ నాయకులు గోపాల్ నాయక్, సతీష్‌రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, బుచ్చన్న, బి.చెన్నయ్య, జే.నరసింహ, జి.మొగులయ్య, యాదయ్య, అంజలయ్య, జ్యోతి, నాగలక్ష్మి, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు



## జంతు జనన నియంత్రణ అదనపు గదిని ప్రారంభించిన ఎమ్మెల్యే

**వారధి న్యూస్ మహబూబ్ నగర్** మహబూబ్ నగర్ పట్టణంలోని మౌలాలి గుట్ట లక్ష్మీ నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన అదనపు జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, కమిషనర్ మహేశ్వర్ రెడ్డి కౌన్సిలర్లు మోతిలాల్, ఖాజా పాషా, తిరుమల వెంకటేష్, జాజిమొగ్గ నర్సింహులు , పాపారాయుడు, ఫ్యాషన్, ఇసామోది, ఉమర్, మునీర్, నాయకులు సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్ యాదవ్, బుద్దారం సుధాకర్ రెడ్డి, ఇమ్మడి పురుషోత్తం, సాదుల్లా, మున్సిపల్ ఎఎస్ఓ సలీం, వార్డు ఆఫీసర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు



## గాంధీ ఆసుపత్రిలో మహిళా డాక్టర్ పై దాడి

- మరోసారి మహిళా డాక్టర్ పై దాడి తో ఆందోళన చెందుతున్న డాక్టర్లు
- మాకు భద్రత కరువైంది
- డాక్టర్లకు భద్రత కల్పించాలని డిమాండ్

**వారధి న్యూస్ సికింద్రాబాద్ :** సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్ మహిళా డాక్టర్ పై దాడి చేసిన పేషెంట్. కొన్ని రోజుల క్రింద మద్యానికి బానిసై మద్యం మత్తులో తరచూ ఇతరుల పై దాడి చేస్తుండడంతో కుటుంబ సభ్యులు మానసిక పరిస్థితిని బాగు చేయటానికి గాంధీ ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. చికిత్స పొందుతున్న సందర్భంలో గాంధీ ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డులో మహిళా డాక్టర్ పై దాడికి చేసిన రోగి. అక్కడే ఉన్న గాంధీ ఆస్పత్రి ఇబ్బంది దాడి చేసిన వ్యక్తిని అడ్డుకొని చిలకలగూడ పోలీసులకు అప్పగించారు. చిలకలగూడ పోలీసులు అతని పై కేసు నమోదు చేసి జరిగిన సంఘటన పై విచారణ చేపట్టారు. కోల్ కతా ట్రైనింగ్ డాక్టర్ దుర్ఘటన మరువకముందే గాంధీ హాస్పిటల్ లో మళ్లీ మహిళా డాక్టర్ పై దాడి జరగడంతో డాక్టర్లు ఆందోళనలకు గురయ్యారు . వెంటనే డాక్టర్ల కు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రోగులకు వైద్య సేవలు అందిస్తున్నన మాలాంటి వారి పై దాడులు జరుగుతుంటే ఎక్కడ ఉందని భద్రత అని ప్రశ్నించారు



## పూజలందుకుంటున్న గణనాథులు

**వారధి న్యూస్ పెబ్బేర్:** పెబ్బేరు మండలం మరియు పట్టణంలో కేంద్రంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సంధర్భంగా కొలువు దీరిన లంబోదరులకు భక్తులు ప్రతీ రోజూ భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వినాయక మండపాల దగ్గర భజన బృందాలచే హరి భజనలు, అడుగుల భజనలు, పిల్లల నృత్య కార్యక్రమాలు మరియు మహిళలచే కోలాటాలు, బొడ్డమ్మలు రకరకాల విన్యాసాలచే వినాయకుని నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు.

వారధి
తెలుగు దిన పత్రిక
www.vaaradhinews.com
GENERAL NEWS
జనరల్ న్యూస్

# అటవీ సంరక్షణ అందరి భాధ్యత

● జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**వారధి న్యూస్, మహబూబ్ నగర్ :** అటవీ సంపద పరిరక్షణ కోసం పని చేస్తూ అమరులైన అటవీ అధికారులు,సిబ్బంది సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో అటవీ అమరవీరుల స్థూపం వద్ద స్థానిక శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి తో కలిసి పుష్పగుచ్చాలనుంచి శ్రద్ధాంజలి ఘటించారు. అటవీ సంరక్షణలో ప్రాణాలర్పించిన అటవీ అధికారులు, సిబ్బంది సేవలు మరువలేనివని అన్నారు. అటవీ సంరక్షణలో ప్రాణాలు కోల్పోయిన వారి సేవలకు గుర్తుగానే ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 11న అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 23 మంది అటవీ అధికారులు, సిబ్బంది అమరులైనారని, అటవీ సంపద అయిన కలప, అక్రమ రవాణా జరగకుండా నిరోధించే క్రమంలో వారు ప్రాణాలు అర్పించారని, ప్రతి ఒక్కరూ చెట్లను రక్షించుకోవాలని, మన జిల్లాలో అటవీ శాతం తక్కువ ఉందని,చెట్లను విరివిగా నాటాలని అన్నారు. ఈ సందర్భంగా అటవీ సంరక్షణలో ప్రాణాలు కోల్పోయిన జిల్లాకు చెందిన అటవీశాఖ అధికారులు, సిబ్బంది ని స్మృతిస్తూ అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు స్థానిక శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అడవులను అటవీ సంపదను సంరక్షించే క్రమంలో ప్రాణాలర్పించిన అటవీ అమరవీరుల స్మరిస్తూ, అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలని, అడవులను నమ్ముకొని బతుకుతున్న చెంచులు, లంబాడ ఇతరుల జీవనోపాధికి ఎటువంటి భంగం కలగాకుండా అడవులను సంరక్షించుకోవాలని అన్నారు. ముందు తరాల వారి కి అడవులను కాపాడుకునేందుకు ప్రత్యేకించి విద్యార్థిని విద్యార్థులకు, యువతకు అర్థమయ్యేలా అటవీ శాఖ తరపున ప్రచారం నిర్వహించాలని చెప్పారు. రాష్ట్రంలో చెరువులు, కుంటలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవడం తో పాటు, అక్రమ కట్టడాలను కూల్చివేయడం జరుగుతుందని, అలాగే అటవీ సంపద కాపాడుకునే విషయంలో ఎవరైన అడ్డు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. అడిషనల్ ఎస్పీ రాములు , జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, సంబంధిత అధికారులు, తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు .



## స్పోర్ట్స్ స్కూల్‌కు స్థల పరిశీలన

● రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేనారెడ్డి

**వారధి న్యూస్, వనపర్తి :** జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు తగిన స్థలం కేటాయించాలని రాష్ట్ర క్రీడా ప్రాధికారక సంస్థ చైర్ పర్సన్ కె. శివసేన రెడ్డి జిల్లా కలెక్టర్ ను కోరారు. బుధవారం సాయంత్రం స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి తో కలిసి కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ ఆదర్శ్ సురభినీ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో ఇంటర్మీడియట్ స్థాయి వరకు స్పోర్ట్స్ స్కూల్ నిర్మాణానికి అనుమతులు వచ్చాయని అందుకు సరిపడ కనీసం 25 ఎకరాల స్థలం కేటాయించాల్సిందిగా కోరారు. స్పందించిన కలెక్టర్ వనపర్తి జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు అనువుగా ఉన్న ప్రభుత్వ భూములను గూగుల్ ఎర్త్ మ్యాప్ ద్వారా చూపించారు. వనపర్తి మండలం పెబ్బేరు రోడ్ లో ఉన్న నాచహళ్ళి స్థలాన్ని, అయ్యవారి పల్లి వద్ద ఉన్న స్థలాన్ని, పాతపల్లి, నాగవరం స్థలాలను చూపించారు. అనంతరం నాగవరం మెడికల్ కళాశాల వద్ద ఉన్న స్థలాన్ని సందర్శించిన చైర్ పర్సన్ ఇక్కడ స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు అనువుగా ఉందని కనీసం 25 ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం హాకీ స్టేడియాన్ని, ఇండోర్ స్టేడియాన్ని సందర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో హాకీ స్టేడియం నిర్మాణానికి ఏమైనా అవకాశం ఉన్నదా అని పరిశీలించారు.స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ , యువజన క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు చైర్ పర్సన్ వెంట ఉన్నారు.






## విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించిన సెక్టోరియల్ అధికారి

**వారధి న్యూస్, ఖిల్లా ఘనపూర్:**మండలంలోని సోలిపూర్, ఘనపూర్ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి యుగంధర్, మండల విద్యాశాఖ అధికారి ఉషారాణి, సోలిపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు జయశంకర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్శనలో మూడు మరియు ఐదు తరగతుల విద్యార్థుల తెలుగు మరియు గణితం సామర్థ్యాలను పరిశీలించారు.ఉపాధ్యాయులు "తొలిమెట్టు" అంశాల ప్రకారం విద్యార్థులకు బోధన చేయాలని, సరైన బోధన సామగ్రిని వినియోగిస్తూ, విద్యార్థుల చేతిరాతను మెరుగు పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు మరియు సీఆర్పీ రాములు తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

● మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అశ్విని రాధా

**వారధి న్యూస్, వనపర్తి:** బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అశ్విని రాధా పిలుపునిచ్చారు. బుధవారం వనపర్తి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బూత్ ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో 40 వేల సభ్యత్వాల లక్ష్యాన్ని నిర్దేశించిందని, ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టి కృషి చేయాలని పేర్కొన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం కావాలని, నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు .ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షురాలు కల్పన, జిల్లా అధికార ప్రతినిధి సరోజ, కార్యదర్శులు సుశీల, పెద్దమందడి మండల కన్వీనర్ జయమ్మ, టప్ప అర్చన తదితరులు పాల్గొన్నారు



## ఆర్ అండ్ ఆర్ కాలనీలో మౌళి క వసతులకు చర్యలు తీసుకుంటాం

● నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:**పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలోని వెంకటాద్రి రిజర్వాయర్ ముంపు గ్రామాల ప్రజలకు వట్టెం గ్రామం వద్ద నిర్మించిన ఆర్ అండ్ ఆర్ కాలనీని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఇటీవలి కురిసిన భారీ వర్షాలకు మట్టి గుట్ట కూలడాన్ని కలెక్టర్ పరిశీలించారు.ఆర్ అండ్ ఆర్ కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీవాసులతో అడిగి తెలుసుకున్నారు.కాలనీవాసులు ఇటీవల భారీ వర్షాల వల్ల గుట్ట నుండి జారిపడుతున్నమట్టి దిబ్బెల వల్ల ప్రాణహాని ఆస్తి నష్టం సంభవిస్తుందని, ఇతర పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అందుకు పరిష్కరించేందుకు అధికారులతో సమావేశం నిర్వహించి ఆర్ అండ్ ఆర్ కాలనీలో సీసీ రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నిర్మాణాలు వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. దేవాలయం, ఫంక్షన్ హాల్ తదితర నిర్మాణాలను వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుట్ట నుండి మట్టి దిబ్బెలు పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట బిజినపల్లి తాహసిల్దార్ రాములు తదితరులు ఉన్నారు.



## నిబంధనలు పాటించాలని ఎస్ఐ బి. సురేష్

**వారధి న్యూస్, అమరచింత:**మండల కేంద్రంలో వినాయక మండపాలను సందర్శించిన ఎస్ఐ బి. సురేష్, వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు పోలీసుల సూచనలను పాటించాలని తెలిపారు. నిమజ్జనం రోజున భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలైన్ పద్ధతిని పాటించాలని, చిన్నపిల్లలు ట్రాక్టర్ల క్రింద పడే ప్రమాదం ఉందని, ట్రాక్టర్ల ఇరువైపులా కాపలా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వినాయక విగ్రహానికి దగ్గరికి రానీయకూడదని, ఊరేగింపులో ఎవరూ మద్యం సేవించకుండా చూసుకోవాలని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జమీర్ పర్వతాలు, సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.`



## 18 ఏళ్ళు నిండిన యువతను ఎలక్టరల్ జాబితాలో చేర్చాలి

● జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వారధి న్యూస్, వనపర్తి:** జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకోబోయే ప్రతి యువతను ఎలక్టర్ జాబితాలో చేర్చేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్ పై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, 2011 జనాభా లెక్కల ఆధారంగా 2011లో 45 సంవత్సరాల వయస్సున్న పిల్లల సంఖ్యను అంచనా వేసి, ప్రస్తుతం వారిలో ఎంతమంది 1718 సంవత్సరాల వయస్సులో ఉన్నారో తెలుసుకోవాలని చెప్పారు. తహశీల్దార్లు ఇప్పటివరకు తీసుకున్న ఫారం 6లు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయని, అర్హులైన యువతను గుర్తించి, కళాశాలలు మరియు పెళ్లి అయిన జంటల నుండి ఫారం 6 తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా మరణించిన ఓటర్ల పేర్లను ఫారం 7 ద్వారా జాబితా నుండి తొలగించాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, ఓటర్ల నమోదుకు సహకారం తీసుకోవాలని ఆయన సూచించారు. ఎలక్టరల్ రోల్ జాబితాలో దివ్యాంగులను గుర్తించి మార్కింగ్ చేయడం, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రతిపాదనలు సిద్ధం చేయడం, కొత్తగా పోలింగ్ స్టేషన్లు అవసరమైతే ప్రతిపాదనలు సమర్పించడం వంటి చర్యలను తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) యం.నగేష్, ఆర్డీఓ పద్మావతి, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.




## ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం జరుపుకోవాలి

● నిమజ్జనానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి
● నాగనూల్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు,
● జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:**జిల్లాలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అధికారులు కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నాగర్ కర్నూల్ మున్సిపాలిటీలోని నాగనూల్ చెరువును పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ సందర్శించి నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి అపశృతితులు తావులేకుండా ఆనందోత్సాహాల నడుమ భక్తి శ్రద్ధలతో నిమజ్జనోత్సవం జరుపుకోవాలని ప్రజలను కోరారు. పట్టణాలలో నిమజ్జన ఉత్సవం సాఫీగా జరిగేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా అక్కడక్కడా ఉన్న గుంతలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శోభాయాత్రకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా రోడ్లకు ఇరువైపులా అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను పైకి భిగించాలని సూచించారు నిమజ్జనం కోసం చెరువుల వద్ద కు తరలి వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. చెరువు వరకు అన్ని గుంతలను పూడ్చాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు చెరువు వద్ద ప్రత్యేకంగా తమ సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో నిమజ్జనం కార్యక్రమం ప్రశాంతంగా ముగుసేలా చూడాలని తెలిపారు. పోలీస్, ఫైర్, ఆర్ అండ్ బీ, ట్రాన్స్కో, పంచాయతీరాజ్, ఫిషరీస్ తదితర శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలని తెలిపారు. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనోత్సవంలో ఏ చిన్న ప్రమాదానికి కూడా ఆస్కారం లేకుండా ముందు జాగ్రత్త చర్యలన్నీ చేపట్టాలని అధికారులకు సూచించారు.నాగర్ కర్నూల్ డి.ఎస్.పి భద్రతా చర్యల గురించి ఒక రూట్ మ్యాప్‌లను తయారు చేసి భద్రతాచర్యలు చేపడుతున్నట్టు కలెక్టర్‌కు తెలిపారు. శోభాయాత్ర కొనసాగే మార్గాలలో సీ.సీ కెమెరా నిఘా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని డి.ఎస్.పి తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈసారి అదనంగా వినాయక ప్రతిమలు ప్రతిష్ఠించడం జరిగిందని, ఇందుకు అనుగుణంగా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తామన్నారు. నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠమైన భద్రత ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ ఆర్డీఓ సురేష్ బాబు, నాగర్ కర్నూల్ డి.ఎస్.పి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు, నాగర్ కర్నూల్ తాహసిల్దార్ చంద్రశేఖర్, ఎస్సై గోవర్ధన్ తదితరులు ఉన్నారు.





## పూజలందుకుంటున్న గణనాథులు

**వారధి న్యూస్ పెబ్బేర్:** పెబ్బేరు మండలం మరియు పట్టణంలో కేంద్రంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సంధర్భంగా కొలువు దీరిన లంబోదరులకు భక్తులు ప్రతీ రోజూ భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వినాయక మండపాల దగ్గర భజన బృందాలచే హరి భజనలు, అడుగుల భజనలు, పిల్లల నృత్య కార్యక్రమాలు మరియు మహిళలచే కోలాటాలు, బొడ్డమ్మలు రకరకాల విన్యాసాలచే వినాయకుని నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు.

వారధి
తెలుగు దిన పత్రిక
www.vaaradhinews.com
GENERAL NEWS
జనరల్ న్యూస్



## అంగన్వాడీ కేంద్రాలకు మౌలిక వసతులపై ప్రతిపాదనలు ఇవ్వండి

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

**వారధి న్యూస్, వనపర్తి:** జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు తక్షణం అవసరమున్న మౌలిక వసతులపై ప్రతిపాదనలు అందించాల్సిందిగా సుపర్వైజర్లకు, సీడీపీఓలకు ఆదేశాలు జారీ చేశారు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) సంచిత్ గంగ్వార్. బుధవారం మధ్యాహ్నం తన ఛాంబర్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీడీపీఓలు, సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించి, అంగన్వాడీ కేంద్రాల భవనాల స్థితిగతులపై సమీక్ష చేశారు. తన సమీక్షలో, స్వంత భవనాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు తాగు నీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు అందుబాటులో ఉండాలని అన్నారు. అలాగే, తక్షణం అవసరమైన మౌలిక వసతుల పై—మరుగుదొడ్లు, తాగు నీటి సదుపాయం, కిచెన్ ప్లాట్‌ఫారం, ఫ్లోరింగ్, ప్రహరీ గోడలు, మరియు ఇతర మరమ్మతుల అవసరాలపై ప్రాజెక్టుల వారీగా నివేదిక అందించాలని సీడీపీఓలను ఆదేశించారు.ఈ సమావేశంలో సీడీపీఓలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



## గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ చర్యలు

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**వారధి న్యూస్, వనపర్తి:** గణేశ్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టామని, ప్రజలు అందరూ సహకరించాలని వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ కోరారు. బుధవారం వనపర్తి పట్టణంలోని గణేశ్ శోభాయాత్ర మార్గాల్లో మర్రికుంట, కొత్త బస్టాండ్, పాలిటెక్నిక్ కాలేజ్, రాజీవ్ చౌక్, అంబేద్కర్ చౌక్, గాంధీ చౌక్, చింతల్ హనుమాన్, నిమజ్జనం జరిగే నల్లచెరువు చెరువు ప్రాంతాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "పోలీసుల సూచనలను పాటించి, నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రశాంతంగా నిమజ్జనం జరగడానికి సహకరించాలి. భద్రత పరమైన అన్ని చర్యలు తీసుకున్నాం, సిసి కెమెరాలు, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశాం, నిమజ్జనం ప్రాంతంలో గజ ఈతగాళ్లు, క్రేన్లు అందుబాటులో ఉంచాం," అని వివరించారు. నిమజ్జనం సందర్భంగా డీజేలు, సౌండ్ సిస్టంలు, బాణాసంచా వాడకాన్ని పూర్తిగా నిషేధించామన్నారు. యువకులు సంయమనంతో ప్రవర్తించాలని, గ్రామ పెద్దలు పిల్లలకు సూచనలు చేయాలని తెలిపారు. చట్టానికి విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్, మున్సిపల్ డి.ఈ. యూనస్, సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగభూషణం, టౌన్ ఎస్ఐ జయన్న తదితర అధికారులు పాల్గొన్నారు



## మూసీ నది వద్ద గణేష్ నిమజ్జనం ఏర్పాట్ల పరిశీలన

- డీఎస్పీ శ్రీధర్ రెడ్డి

**వారధి న్యూస్, నేరేడుచర్ల:** గణేష్ నిమజ్జనం కోసం మూసీ నది వద్ద ఏర్పాట్లను బుధవారం రాత్రి కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి పరిశీలించారు. నేరేడుచర్ల, గరిడేపల్లి మండలాల పరిధిలోని గణపతి విగ్రహాలను నవరాత్రుల తర్వాత చిల్లేపల్లి మూసీ నది వద్ద నిమజ్జనం చేసేందుకు వచ్చే అవకాశం ఉండడంతో, ఈ ప్రాంతంలో క్రేన్, జేసీబీ వంటి పరికరాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, నదిలోకి ఎవరు దిగకుండా భారీ కేడ్లు ఏర్పాటు చేయాలని, పరిమిత సంఖ్యలోనే భక్తులను అనుమతించాలని సూచించారు. ట్రాక్టర్లు, డీసీఎంలకు మాత్రమే అనుమతి ఉండాలని, లారీలలో తీసుకొస్తున్న విగ్రహాలను మహంకాళిగూడెం లేదా వాడపల్లి లోని కృష్ణా నది వద్ద నిమజ్జనం చేయించాలని తెలిపారు.చిన్న వంతెనపై స్టేజీలు ఏర్పాటు చేసి, వాటి ద్వారా విగ్రహాలను నదిలో వదిలే ఏర్పాట్లను పూర్తిగా చూసుకోవాలని సూచించారు. విస్తృతంగా లైటింగ్ ఏర్పాట్లు చేయాలని, ముందుగానే క్రేన్, జేసీబీ ఏర్పాటు చేయడానికి ట్రయల్ చేయాలని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని, నిమజ్జనం సమయంలో కేవలం పారిశుధ్య కార్మికులు, పోలీస్ సిబ్బంది సహకారం తీసుకోవాలని డీఎస్పీ ఆదేశించారు. ఈ పరిశీలనలో డీఎస్పీ వెంట హుజూర్ నగర్ సీఐ చరమంద రాజు, ఎస్ఐ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## పిడిఎఫ్ బియ్యాన్ని అక్రమంగా సేకరించిన వారి పై చర్యలు



**వారధి న్యూస్, నాంపల్లి:** పిడిఎఫ్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి అధిక ధరకు అమ్ముతున్నట్లు సమాచారం వచ్చిన నేపథ్యంలో, నాంపల్లి మండల సబ్ ఇన్ స్పెక్టర్ ఎం. శోభన్ బాబు మరియు ఆయన సిబ్బందితో కలిసి తుంగపాడు గ్రామంలో తనిఖీ నిర్వహించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసిన దాదాపు 20 క్వింటాళ్ల పిడిఎఫ్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి ఎక్కువ ధరకు అమ్మే ప్రయత్నంలో ఉన్నారు. ఈ అక్రమ కార్యకలాపాన్ని చుట్టూ తనిఖీ చేసినపుడు, ఒకరి ఇంటి వద్ద 20 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా సేకరించి ఎక్కువ ధరకు అమ్మే ప్రయత్నం జరుగుతున్నట్లు నిర్ధారించబడింది. అనుబంధంగా, నాంపల్లి మండలంలోని కేతేపల్లి గ్రామానికి చెందిన ఉప్పల సాయి, తండ్రి బిక్షమయ్య మరియు చింతపల్లి మండలం వింజమూరు గ్రామానికి చెందిన అలంపల్లి శ్రవణ్ కుమార్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసి, 20 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనపరచుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# కాపర్ దొంగల అరెస్ట్

- యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నుండి కాపర్ సామగ్రి దొంగతనానికి సంబంధించి ఎనిమిది మందిని అరెస్టు
- 26 లక్షల నగదు, 2 మహేంద్ర క్యాంపరీ వాహనాలు స్వాధీనం
- ఎస్పీ శరత్ చంద్ర పవర్



**వారధి న్యూస్, మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లా దామచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నుండి కాపర్ సామగ్రిని దొంగలించిన ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవర్ తెలిపారు. అరెస్టు చేసిన వారి వద్ద 20 లక్షల నగదు మరియు రెండు మహేంద్ర క్యాంపరి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.
బుధవారం స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో విలేకరులతో మాట్లాడిన ఎస్పీ, మిర్యాలగూడ పట్టణానికి చెందిన పాత ఇనుము వ్యాపారి మేకల శ్రీనివాస్, దామరచర్ల మండలం తాళ్ల వీరప్పగూడెం గ్రామానికి చెందిన బెల్ట్ షాపు నిర్వాహకుడు పెండెం భాస్కర్, సాత్ తండకు చెందిన గూగులోతు రఘు, వీర్లపాలెం కు చెందిన కొర్ర శివ, తాళ్ల వీరప్పగూడెంకు చెందిన చేన్నబోయిన నాగయ్య, సాత్ తండాకు చెందిన గూగులోతు రాముడు, మిర్యాలగూడ పట్టణానికి చెందిన పాత ఇనుము వ్యాపారులు బత్తుల జానకిరాములు, పగడాల బాలరాజులను అరెస్టు చేశామని తెలిపారు.
ఈ నిందితులు గత రెండు సంవత్సరాలుగా వైటిపిఎస్ పక్కన గల వాగు నుండి రాత్రి సమయంలో ప్లాంట్ లోకి ప్రవేశించి, బిహెచ్ఇఎల్ కంపెనీకి చెందిన స్టోర్ యార్డ్ వద్ద సెక్యూరిటీ సిబ్బంది లేని సమయంలో కాపర్ సామాగ్రి మరియు ఇతర వస్తువులను దొంగిలించి, వాటిని నిర్మానుష ప్రాంతాల్లో నిల్వ చేసి, క్యాంపర్ వాహనాలలో లోడ్ చేసి మిర్యాలగూడకు చెందిన పాత ఇనుము వ్యాపారులకు అమ్ముతున్నట్లు గుర్తించారు.
డీఎస్పీ కె.రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో సీఐలు నాగార్జున, కె.వీరబాబు, సీసీఎస్ సీఐ జితేందర్ రెడ్డి, సిబ్బంది విష్ణువర్ధన్ గిరి, పుష్పా గిరి, వాహిద్ పాషా వారిని అభినందించారు.



## మల్కాజిగిరి నుంచి ఖమ్మం వరద బాధితులకు సాయం

**వారధి న్యూస్, మల్కాజిగిరి:** ఖమ్మం వరద బాధితులను ఆదుకోవాలనే ఉద్దేశంతో, మల్కాజిగిరికి చెందిన మానవసేవే మాధవసేవ టీం, తమ శ్రేయోభిలాషుల సహకారంతో 15 క్వింటాళ్ల బియ్యం, నిత్యవసర సరుకులను సేకరించారు. మంగళవారం ఉదయం, మల్కాజిగిరి గౌతమ్ నగర్ చౌరస్తా నుండి ఆటో ద్వారా ఖమ్మం లోని కర్ణ గిరి గృహకల్ప కాలనీ మరియు జలగం నగర్ బస్తీకి చేరుకుని వరద బాధితులకు బియ్యం మరియు ఇతర నిత్యవసర సరుకులను అందజేశారు.ఈ కార్యక్రమంలో మానవసేవే మాధవసేవ ప్రతినిధి కుమ్మరి రాజు మాట్లాడుతూ, ఖమ్మం వరద బాధితులు సహాయం కోసం ఎదురు చూస్తున్నారని, మల్కాజిగిరితో పాటు ఇతర జిల్లాల ప్రజలు కూడా సహాయం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ రషీద్, పోచంపల్లి మహేష్, వెంకటరమణ, నరేష్, స్థానిక విలేకరులు చంద్రశేఖర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆప్టోరియా పరిశ్రమ ముందు ధర్నాకు బిజెపి పార్టీ మద్దతు

**వారధి న్యూస్, హత్నూర్ :** ఆప్టోరియా కెమికల్ పరిశ్రమ ముందు గత రెండు రోజులుగా జరుగుతున్న నిరసన దీక్షకు బిజెపి పార్టీ పూర్తి మద్దతు తెలిపింది. స్థానిక యువత మరియు కాంట్రాక్టు కార్మికులు పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ, స్థానికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. సమావేశంలో, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళిదర్ యాదవ్, స్థానిక కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిశ్రమ యాజమాన్యం సానుకూలంగా స్పందించి తగు న్యాయం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా, యాజమాన్యం పరిశ్రమ తీరుపై పలు నినాదాలు చేయడంతో, వారు తమకు న్యాయం చేయాలని కోరారు.కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రాజ్ మల్లారెడ్డి, సతీష్ యాదవ్, నాగప్రభు గౌడ్, శ్రీకాంత్ యాదవ్, రవి, కమలాకర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు. పరీక్షించిన హెచ్ ఆర్ అశ్విన్ కుమార్, ధర్నా చౌక్ దగ్గరికి వచ్చి, కార్మికులతో మాట్లాడారు. అశ్విన్ కుమార్, స్థానికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి, నిరసన ధర్నాను రాత్రి వరకు కొనసాగిస్తామని చెప్పారు. కార్మికులు, స్పష్టమైన రాతపూర్వక హామీ వచ్చేవరకు తమ ధర్నాను విరమించేది లేదని ప్రకటించారు.



## ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద పంపిణీ

**వారధి న్యూస్, ఉప్పల్:** ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కొలువు తీరిన గణనాథుడి దగ్గర బుధవారం అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మల్కాజిగిరి డివిజన్ ఏసీపీ చక్రపాణి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోతె వెంకటరెడ్డి ప్రారంభించారు.కార్యక్రమంలో ఉప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి, చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్, కార్యదర్శి దొంతుల వెంకట్రామ్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టి మల్కయ్య, జిల్లా ఉపాధ్యక్షులు రాంప్రసాద్ శర్మ, హెల్త్ కమిటీ సభ్యులు కె. చంద్రమౌళి, విజయ్, ఉప్పల్ నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు పల్ల మహేందర్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ హుండి లెక్కింపు

**వారధి న్యూస్, బాలాపూర్:** మీర్పేట్ కార్పొరేషన్ 41వ డివిజన్ జిల్లెల్లగూడలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆలయ హుండి లెక్కింపు కార్యక్రమం బుధవారం నాడు నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ఆలయ అధికారి, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో జరిగింది.మూడు నెలల కాలంలో భక్తుల ద్వారా శ్రీ వారికి 1,95,965 రూపాయల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బొక్క రాజేందర్ రెడ్డి, బొమ్మరబోయిన యాదగిరి, చింతపట్ల జ్ఞానేశ్వర చారి, ఫౌండర్ చైర్మన్ శ్రీ రాజా సంజయ్ గోపాల్ సాయించేర్, దేవాలయ కార్యనిర్వాహనాధికారి వై శ్రీనివాస్ రెడ్డి, దేవాలయ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.





## పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణ

- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

**వారధి న్యూస్, మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఖాజా మొయినిద్దీన్ ఆధ్వర్యంలో, ఆంగోతు హరి డ్రైవర్ గా పనిచేస్తున్న కొమ్మినేని నరేష్ యొక్క అశోక్ లేలాండ్ దోస్త్ వాహనాన్ని ఉపయోగించి, పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.గత కొంతకాలంగా, మిర్యాలగూడ పట్టణంలో సేకరించిన రేషన్ బియ్యాన్ని పల్నాడు జిల్లా కల్లూరి లింగయ్య, మండపాటి నరసింహారావు, బొమ్మిరెడ్డి రమేష్ సహకారంతో గూడూరు వరకు పంపిస్తున్నారు. అక్కడి నుండి, కొప్పుల అప్పారావు ఆ బియ్యాన్ని తీసుకొని, ఎలాంటి అనుమతులు లేకుండా కాకినాడ పోర్టు వరకు దొంగ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందింది.ఈ అక్రమ కార్యకలాపాలపై దృష్టి సారించిన పోలీసులు, 24 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, అక్రమ రవాణా చేసే వాహనాన్ని సీజ్ చేశారు. డ్రైవర్ ఆంగోతు హరి, బొమ్మిరెడ్డి రమేష్, కొప్పుల అప్పారావును మిర్యాలగూడ టూ టౌన్ పోలీసుల పరిశీలనలో అరెస్టు చేసి, జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచినట్లు డీఎస్పి రాజశేఖర్ రాజు తెలిపారు.



## లాడ్జీల యాజమాన్యాలకు డీసీపీ కౌన్సిలింగ్

**మంచిర్యాల:** మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జీల యజమానులకు బుధవారం డిసిపి భాస్కర్ ఐపిఎస్ కౌన్సిలింగ్ నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్ ఐజి ఆదేశాలతో జరిగిన ఈ సమావేశంలో, లాడ్జీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, అద్దెకు తీసుకునే ప్రతి వ్యక్తి యొక్క ఐడి కార్డు/ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకోవడం, ఫోన్ నెంబర్ సరిచేయడం, కస్టమర్ల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయడం వంటి కీలక సూచనలు అందించారు.

## మణికొండ మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు

**వారధి న్యూస్, గండిపేట్:** మణికొండ మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులు చేపట్టాలని చైర్‌పర్సన్ కస్తూరి నరేందర్ సూచించారు. బుధవారం, ఆయన అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి, మున్సిపాలిటీకి సంబంధించిన అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపును అధికారికంగా ప్రకటించారు. ఎలక్ట్రికల్ వర్క్‌ల కోసం 25 లక్షలు, నూతన మున్సిపల్ భవన మిగులు పనుల కోసం 500 లక్షలు, వట్టినాగులపల్లి డంపింగ్ యార్డులో కంపోస్ట్ షెడ్ మరియు ఇతర అభివృద్ధి పనుల కోసం 100 లక్షలు, వివిధ ఉత్సవాల కోసం 35 లక్షలు, హెచ్ఎండబ్ల్యుయస్అండ్ఎస్‌బీ పనుల నిర్వహణ కోసం 100 లక్షలు కేటాయించారు.ఈ సమావేశంలో వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ ప్రదీప్ కుమార్, మేనేజర్ శ్రీధర్, డిఈ దివ్యజ్యోతి, ఏఈ సంజయ్ కుమార్, అకౌంటెంట్ వీరస్వామి, ఇతర శాఖల అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

www.vaaradhinews.com
వారధి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్



## ఖమ్మం వరద బాధితులకు రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం ఆర్థిక సహాయం

**వారధి న్యూస్,చర్ల:** ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఖమ్మం జిల్లా వరద బాధితులకు సహాయం అందించేందుకు స్థానిక రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అవసరమైన సేవలతో పాటు, విద్యారంగంలో మరియు వైద్య రంగంలో విశేషంగా సేవలందిస్తున్న డి.ఎన్. కుమార్‌ను అభినందిస్తూ, వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అకాల వర్షాల కారణంగా నిరాశ్రయులైన వారికి సహాయం అందించేందుకు దాతలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. పాఠశాల విద్యార్థులతో ముచ్చటించిన ఆయన, ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఈదయ్య, తదితరులు కూడా పాల్గొన్నారు. రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం సీనియర్ అధ్యాపకులు డాక్టర్ వెంకట్రావు చేతుల మీదుగా స్థానిక తహశీల్దార్ శ్రీనివాస్ కు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం వైస్ ప్రిన్సిపల్ ఎం.వీ.ఎల్. నరసింహారావు, సీనియర్ ఉపాధ్యాయులు జిపి రామారావు, బి.క్రాంతి కుమార్, బోసుబాబు, ప్రదీప్ కుమార్, సునీత, ఉస్మాన్, పద్మ, రమాదేవి, చైతన్య శ్రీ, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## బాలికల భద్రత, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం

**వారధి న్యూస్,శంకర్ పల్లి:** ఐసీఏఫ్ ఏఐ లా స్కూల్ లీగల్ ఎయిడ్ సొసైటీ ఆధ్వర్యంలో శంకర్ పల్లి మున్సిపల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల)లో బాలికల భద్రత, ఆరోగ్యం మరియు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసీఏఫ్ ఏఐ లా స్కూల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గీత, భారతదేశ భవిష్యత్తు కోసం బాలికల ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యతను వివరణగా వివరించారు. బి.ఎల్.ఎల్.బి తుది సంవత్సరం విద్యార్థులు నిర్వహించిన నాటకం ద్వారా, రుతుస్రావం (మెన్స్ట్రేషన్స్) పై ఉన్న అపోహలు మరియు వాటిని ఎలా అధిగమించాలో తెలియజేశారు.పోస్టర్ ప్రదర్శన ద్వారా రుతుస్రావ పరిశుభ్రత చర్యలు పై దృష్టి పెట్టారు, అలాగే బాలికల భద్రతా జాగ్రత్తలపై క్విజ్ పోటీలు కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వేద శ్రీ, డాక్టర్ కె.వి. రవికుమార్, డాక్టర్ కన్నన్, డాక్టర్ ఇతి వ్యాస మరియు ఐసీఏఫ్ ఏఐ లా స్కూల్ లీగల్ ఎయిడ్ సొసైటీ సభ్యుల సమన్వయంతో నిర్వహించబడింది. ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన సదస్సు

**వారధి న్యూస్,వనపర్తి :** వై ఆర్ జి కేర్ స్వచ్ఛంధ సంస్థ లింక్ వర్కర్ స్కీమ్ ప్రోగ్రాం ద్వారా బుధవారం నాడు వనపర్తి జిల్లా పెద్దగూడెం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులకు హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో, సంస్థ డి ఆర్ పి శ్రీకాంత్ రెడ్డి హెచ్ఐవి వైరస్ నాలుగు రకాలుగా సోకే అవకాశం ఉందని వివరించారు. కలుషితమైన సూదులు మరియు ఇంజక్షన్లు వాడరాదని, హెచ్ఐవి సోకిన వ్యక్తుల రక్తం తీసుకోకూడదని, అలాగే వారితో లైంగిక సంబంధం పెట్టుకునేటప్పుడు తప్పనిసరిగా కండోమ్ వాడాలని సూచించారు. తల్లి హెచ్ఐవి సోకినట్లయితే, ఆసుపత్రిలో సురక్షితంగా కాన్పు చేయించాలని, తద్వారా పుట్టబోయే బిడ్డకు హెచ్ఐవి రాకుండా నివారించవచ్చని తెలిపారు. క్షయ వ్యాధి పై కూడా అవగాహన కల్పించారు.వారి సూచనల ప్రకారం, ప్రతి ఒక్కరూ రక్త పరీక్షలు చేయించుకొని హెచ్ఐవి ఉన్నదో లేదో తెలుసుకోవాలని, హెచ్ఐవి సోకిన వ్యక్తులు కూడా భయపడకూడదని, మందుల ద్వారా జీవిత కాలాన్ని పొడిగించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగస్వామి, ఉపాధ్యాయులు రాధిక, రవీందర్ రెడ్డి, శేఖర్, కె. రాములు మరియు వై ఆర్ జి కేర్ సంస్థ సి ఎల్ డబ్ల్యూ ఆలిబాబు, 100 మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## కేశవ్ కుటుంబానికి సూర్యాపేట జర్నలిస్టుల అండ

**వారధి న్యూస్, సూర్యాపేట:** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జర్నలిస్టు కేశవ్ కుటుంబానికి సూర్యాపేట జర్నలిస్టులు ఆర్థిక, నైతిక భరోసా కల్పించారు. సహచర జర్నలిస్టు మృతితో ఆయన కుటుంబానికి సహాయం చేయాలని మిత్రుల పిలుపు మేరకు, 62 మంది జర్నలిస్టులు కలిసి రూ.50,066/ ను సమీకరించారు. బుధవారం స్థానిక జె ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమంలో ఈ నిధులను కేశవ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా, కేశవ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.






## బునాదిగాని కాలువకు నిధులు మంజూరు చేయాలని సిపిఎం ఆందోళన

**వారధి న్యూస్, భువనగిరి:** సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బునాదిగాని కాలువకు నిధులు మంజూరు చేసి గోదావరి జలాలను అందించాలంటూ మోటార్ సైకిల్ యాత్ర చేపట్టారు. రెండవ రోజు భువనగిరి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ముగింపున అనంతరం కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ, భువనగిరి జిల్లాకు ఆధారంగా ఉన్న చిన్న నీటి వనరులపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. 2006 సంవత్సరంలో ప్రారంభమైన బునాదిగాని కాలువను పూర్తి చేయడం కోసం వివిధ ప్రభుత్వాలు మార్చుకున్నప్పటికీ, కాలువ నిర్మాణం పూర్తవలసిన 98 కిలోమీటర్లలో కేవలం 34 కిలోమీటర్లు మాత్రమే పూర్తి అయిందని, ఇప్పటివరకు 34 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. కాలువను పూర్తి చేయడానికి 269 కోట్ల రూపాయల నిధులు అవసరమని, ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని, వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి శాసనసభ్యులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూ, కాలువ పూర్తి చేయడానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ, బునాదిగాని కాలువ ద్వారా శామీర్ పేట చెరువు నుండి గోదావరి జలాలను బీబీనగర్ చెరువుకు పంపించి, భువనగిరి మరియు బీబీనగర్ మండలాలకు నీరు అందించవచ్చని చెప్పారు. కాళేశ్వరం కాలువకు తూము ఏర్పాటు చేసి, పహిల్వాన్ పురం బునాదిగాని చెరువును నింపడం ద్వారా గోదావరి జలాలను అందించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, నాయకులు మరియు పలు సంఘాలు పాల్గొన్నారు. ధర్నా అనంతరం అదనపు కలెక్టర్ గంగాధర్ కు వినతి పత్రం అందజేశారు.





## కన్వేయన్స్ డ్రైవర్ల సమస్యలపై నిరవధిక సమ్మె

**వారధి న్యూస్, మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని ఎస్ఆర్పి ఓసి లో పనిచేస్తున్న కన్వేయన్స్ డ్రైవర్ల వేతనాల సమస్యలను, పని భద్రతను కల్పించాలని గత నెల 29న సింగరేణి అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చారు. సింగరేణి అధికారులు ఇప్పటివరకు ఈ సమస్యలను పరిష్కరించే చర్యలు తీసుకోకపోవడంతో, కన్వేయన్స్ డ్రైవర్లు ఈనెల 13వ తేదీ నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నారని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ తెలిపారు.
డిమాండ్ల ప్రకారం, సింగరేణి యాజమాన్యం కన్వేయన్స్ డ్రైవర్ల వేతనం, బోనస్ మరియు పిఎఫ్ వివరాలను పూర్తిగా స్పష్టంగా ఇవ్వాలని, బినామీ ఓనర్లు తమ హక్కులను కార్మికులకు అందించకుండా తమ ఖజానాను నింపుతున్నారని ఆయన ఆరోపించారు. బినామీ ఓనర్లకు వ్యతిరేకంగా మాట్లాడిన కార్మికులను విధుల నుండి తొలగించడం, తమ వేతనాల గురించి మాట్లాడిన వారిపై ప్రతికూల చర్యలు తీసుకోవడం జరుగుతోందని చెప్పారు.
సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం స్పందించకపోతే, 13వ తేదీ నుండి నిరవధిక సమ్మెలో పాల్గొని, తమ సమస్య పరిష్కారం అయ్యేవరకు కొనసాగించనున్నట్లు సిఐటియు ప్రకటించింది. ఈ కార్యక్రమంలో గట్టు మహేందర్ (ఎస్ సి కె ఎస్ సి ఐ టి యు డివిజన్ కార్యదర్శి), కాసిపేట రాజేశం, సంపత్ రావు (కన్వేయన్స్ డ్రైవర్ యూనియన్ సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు), రాజు, సురేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## వినాయక నిమజ్జన సందర్భంగా భారీ ధరకు లడ్డూలు వేలం

**వారధి న్యూస్ ,వికారాబాద్ :** జిల్లా తాండూరు పట్టణంలో బుధవారం వినాయక నిమజ్జన కార్యక్రమం జరగడంతో, భక్తులు పలు మండపాల్లోని వినాయకుని ప్రసాదమైన లడ్డులను వేలం పాట ద్వారా కొనుగోలు చేయడంలో ఉత్సాహం చూపించారు. పటేల్ భాగీచ గణేష్ మండపంలో, వినాయకుడి లడ్డూ రూ. 4,11,111/ (నాలుగు లక్షల పదకొండు వేల నూట పదకొండు రూపాయలు) కు మంచాల భాను రేఖ మరియు అశోక్ కుమార్ కుటుంబ సభ్యులు గెలుచుకున్నారు.కన్యాపాఠశాల వద్ద ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలోని లడ్డూ రూ. 3,61,000/ (మూడు లక్షల ఒకలక్ష వెయ్యి రూపాయలు)కు బంటారం అభిలాష్ కొనుగోలు చేశారు.బాలాజీ మందిర్లో, మార్వాడి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో లడ్డూ రూ. 1,91,000/ (ఒక లక్ష తొమ్మిది వేల రూపాయలు)కు మార్వాడీ బజార్ కు చెందిన నందకిషోర్ పర్తాని కుటుంబం కొనుగోలు చేశారు. వినాయక చౌరస్తా ప్రధాన వినాయకుని వద్ద నిర్వహించిన వేలం పాటలో వస్త్రశ్రీ ట్రెండ్స్ వ్యాపారులు పునీత్ కుమార్ మరియు విద్యా సాగర్ లడ్డూ గెలుచుకున్నారు.





## గణనాథుల పూజా కార్యక్రమాల్లో కౌన్సిలర్ కంచెరవి

**వారధి న్యూస్, వనపర్తి టౌన్:** 6వ, 7వ వార్డు పీర్లగుట్ట తిరుమల కాలనీలో నిర్వహించిన గణనాథుల పూజా కార్యక్రమాల్లో కౌన్సిలర్ కంచరవి పాల్గొన్నారు. పీర్లగుట్ట నీళ్ల ట్యాంక్ పక్కన గోకం కాంతు మరియు నిర్వాహకులు ఏర్పాటు చేసిన గణనాథుని పూజలో కౌన్సిలర్ కంచరవి సానుకూలంగా పాల్గొని అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులను అభినందించి, వారు కూడా కౌన్సిలర్ ను సన్మానించారు. తిరుమల కాలనీలో గోకం మధు, గోకం విజయ్ మరియు నిర్వాహకులు ఏర్పాటు చేసిన గణపతి పూజలో కూడా కౌన్సిలర్ కంచరవి పాల్గొని, అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు. తదుపరి, తిరుమల కాలనీలో రామకృష్ణ శ్రీను యాదవ్ మరియు ఇతర నిర్వాహకులు నిర్వహించిన గణపతి పూజలో కూడా కౌన్సిలర్ కంచరవి పాల్గొని, అన్నదాన కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమాలలో కాలనీవాసులు కూడా పాల్గొన్నారు.



## ఆయిల్ ఫామ్ పై శిక్షణ కార్యక్రమం

**వారధి న్యూస్, చండూరు :** మండల పరిధిలోని బంగారిగడ్డ గ్రామంలోని రైతు వేదికలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నల్లగొండ జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి వి.వి.ఎస్. సాయిబాబా మరియు హార్టికల్చర్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. శ్రీనివాసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు పామాయిల్ మొక్కలు వేసుకున్న రైతులకు ఎకరాకు రూ. 4,200 సబ్సిడీ అందించబడుతుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీ రైతులకు మరియు ఐదు ఎకరాల లోపు ఓసి రైతులకు 90 శాతం రాయితీ అందించబడుతుంది. ఓసి రైతులందరికీ 80 శాతం రాయితీ ఉంటుందని, 7 శాతం జిఎస్టిని రైతులు, 11 శాతం జిఎస్టిని ఉద్యాన శాఖ భరిస్తుందని వివరించారు. పామాయిల్ పంట వేయించిన రైతులకు నాలుగు సంవత్సరాల నుండి పంట దిగుబడి ప్రారంభమై, 35 సంవత్సరాల పాటు పొందవచ్చని తెలిపారు. పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బి. యాదగిరి, మార్కెట్ కు ఇబ్బంది లేని పంట అయిన ఆయిల్ పామ్‌ను నల్లగొండ జిల్లాలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. నెటాఫిమ్ కంపెనీ సీనియర్ ఆగ్రోనోమిస్ట్ అధికారి సుబ్బారావు, మొక్కలకు నీటి యజమాన్యం మరియు ఎరువుల యజమాన్యం గురించి వివరించారు. రైతులు ఆయిల్ ఫామ్ పంట వేయడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ అధికారి ఎస్. శ్రీనివాసు, నెటాఫిమ్ కంపెనీ సౌత్ ఇండియా ఆగ్రో నోమిస్ట్ అధికారి ఏ.వి. సుబ్బారావు, పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ బి. యాదగిరి, నల్లగొండ జిల్లా ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ మేనేజర్ నర్రా రవీందర్ రెడ్డి, పతాంజలి కంపెనీ ఫీల్డ్ అసిస్టెంట్స్ యాదయ్య, మోహన్, సురేష్, స్వామి, వెంకటేష్, శ్రీను మరియు 120 మంది రైతులు పాల్గొన్నారు.



## విఘ్నేశ్వరుని పూజ లో సింగిరెడ్డి వాసంతి

**వారధి న్యూస్, వనపర్తి టౌన్:** గణేష్ నగర్‌లో మహదేవ్ యువత ఆధ్వర్యంలో ప్రతిష్టించిన సిద్దిబుద్ధి సమేత విఘ్నేశ్వరుని దర్శించడానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సతీమణి సింగిరెడ్డి వాసంతి, మాజీ కౌన్సిలర్ నందిమల్ల శారద ఆహ్వానం మేరకు వచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. .పూజా అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రజలందరిని అష్టఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండే విధంగా విఘ్నేశ్వరుని వేడుకున్నారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న మహదేవ్ యువతను అభినందిస్తూ, శాంతియుతంగా పండుగ నిర్వహించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, కె. గోపాల్, ఎ. వెంకటేష్, నవీన్, విజయ్, హర్ష, సందీప్, రాఘవేందర్, శివ, మరియు మహిళలు పాల్గొన్నారు.



వారధి
తెలుగు దిన పత్రిక
www.vaaradhinews.com

Movie Time మూవీ టైమ్



# సమీరగా సంయుక్త

యాక్షన్-హాల్క్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ #BSS12, ఆయన పరిశ్రమలోకి అడుగుపెట్టి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మైల్ స్టోన్ మూవీగా నిలుస్తోంది. హై బడ్జెట్, అత్యుత్తమ సాంకేతిక విలువలతో మ్యాసివ్ స్కేల్ లో ఈ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రానికి డెబ్యూటెంట్ లుధీర్ బైరెడ్డి దర్శకత్వం వహిస్తుండగా, మూన్‌షైన్ పిక్చర్స్‌పై మహేష్ చందు నిర్మిస్తున్నారు. శివన్ రామకృష్ణ సమర్పిస్తున్న ఈ చిత్రం బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కి మోస్ట్ ఎక్స్‌పెన్సివ్ మూవీ. సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. 400 ఏళ్ల నాటి గుడి నేపథ్యంలో ఒకల్ట్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో సంయుక్త ఫీమేల్ లీడ్ లో నటిస్తున్నారు. ఆమె పుట్టినరోజును పురస్కరించుకుని మేకర్స్ సంయుక్త పాత్రను సమీరాగా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. గ్లాస్ షెల్ఫ్‌లపై రకరకాల నిర్మాణాలు కనిపిస్తుండగా, ఇంటెన్స్ లుక్స్ తో కూడిన మోడరన్ అమ్మాయి లుక్‌లో సంయుక్త అద్భుతంగా కనిపించింది.




## మంచి మనసు చాటుకున్న సుప్రీమ్ హీరో

సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుంటారు సుప్రీమ్ హీరో సాయి దుర్గతేజ్. ఎన్నో సందర్భాల్లో ఛారిటీ కార్యక్రమాలు చేసి తన మంచి మనసు చాటుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షా లు, వరదలతో ఇబ్బంది పడిన తెలుగు ప్రజలను ఆదుకునేందుకు తన వంతుగా 20 లక్షల రూపాయల విరాళాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సీఎం రిలీఫ్ ఫండ్ కు అందించారు. తాజాగా ఆయన విజయవాడలో పర్యటించి అమ్మ అనాథాశ్రమానికి తన విరాళం అందజేశారు. ఈ రోజు విజయవాడ చేరుకున్న సాయి దుర్గతేజ్ మొదట శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శనం చేసుకుని ఆశీస్సులు అందుకున్నారు. ఆ తర్వాత అమ్మ అనాథాశ్రమానికి వెళ్లి అక్కడి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అమ్మ అనాథశ్రమానికి 2 లక్షల రూపాయలు, ఇతర సేవా సంస్థలకు 3 లక్షల రూపాయల విరాళం అందించారు. అమ్మ ఆశ్రమానికి సొంత భవనం కట్టిస్తానని 2019లో తన పుట్టినరోజున మాటిచ్చిన సాయి దుర్గతేజ్...చెప్పినట్లుగానే 2021లో బిల్డింగ్ కట్టించి ఇచ్చారు. మూడేళ్ల పాటు అమ్మ అనాథాశ్రమాన్ని దత్తత తీసుకుని మొత్తం ఖర్చులన్నీ భరించారు. సాయి దుర్గతేజ్ మంచి మనసుకు ఆశ్రమవాసులతో పాటు ప్రజలందరి ప్రశంసలు దక్కాయి. మేనమామ, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారి నుంచి సేవా గుణాన్ని పుణికిపుచ్చుకున్న సాయి దుర్గతేజ్ భవిష్యత్ లోనూ తనకు వీలైనంతగా సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజానికి తనవంతుగా అండగా నిలబడాలని భావిస్తున్నారు.




బీజేపీ ఎంపీ రఘునందన్ రావు

## కళింగ పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను

కిరోసిన్ సినిమాతో మంచి పేరు తెచ్చుకున్న ధృవ వాయు ఇప్పుడు 'కళింగ'తో హీరో మరియు దర్శకుడిగా రాబోతున్నారు. బిగ్ హిట్ ప్రొడక్షన్స్ పతాకంపై దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్ నిర్మించిన ఈ సినిమాపై ఇప్పటికే మంచి బజ్ ఏర్పడింది. టీజర్, పోస్టర్‌లు, గ్లింప్స్, సాంగ్స్ అన్నీ కూడా అందరినీ ఆకట్టుకున్నాయి. సెప్టెంబర్ 13న విడుదల కాబోతోన్న ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నేత, ఎంపీ రఘునందన్ రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో.. బీజేపీ నేత, ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. 'ఎవరు ఎంత బిజీగా ఉన్నా.. రోజంతా ఉన్న అలసటను తీర్చుకోవడానికి సినిమాలు చూడటం అనేది మన కల్చర్‌లో భాగం. కరోనా తరువాత అందరూ ఓటీటీకి అలవాటు పడ్డారు. తెలుగు చిత్ర పరిశ్రమలో ఇప్పుడు ఎక్కువగా ప్రయోగాలు వస్తున్నాయి. చిన్న చిత్రాలు పెద్ద విజయాన్ని సాధిస్తున్నాయి. టీజర్, ట్రైలర్ చూస్తే భయపెట్టించేలా ఉన్నాయి. ఈ మూవీ కూడా భారీ విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాను తీసిన ధృవ, నిర్మాతలకు మంచి లాభాలను రావాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. నిర్మాత దీప్తి కొండవీటి మాట్లాడుతూ.. 'కళింగ సినిమా అద్భుతంగా వచ్చింది. పాటలు, మ్యూజిక్ గురించి అంతా మాట్లాడుకుంటారు. ఆర్ఆర్ మ్యాజిక్‌ను థియేటర్లో చూడాల్సిందే. అక్షయ్ విజువల్స్ అద్భుతంగా ఇచ్చారు. సంజు ఈ చిత్రంలో హ్యాండ్సమ్ విలన్‌గా కనిపిస్తాడు. కిరోసిన్ చేసిన ఆర్యనే ఈ చిత్రానికి కూడా ఉండాలని అనుకున్నాం. మా ఈవెంట్‌కు తిరువీర్ గారు రావడం ఆనందంగా ఉంది. యాకూబ్ గారు అద్భుతంగా డైలాగ్స్ రాశారు. ప్రగ్యా ఈ చిత్రంలో ఎక్సలెంట్‌గా అనిపిస్తుంది. ఆమె కళ్లతోనే నటించింది. లుక్స్ పరంగానూ తెరపై అద్భుతంగా కనిపిస్తుంది. ధృవ గారి డెడికేషన్, ప్యాషన్ వల్లే మేం ఈ రోజు ఇక్కడ ఉన్నాం. పృథ్వీ గారు ఈ చిత్రం కోసం ప్రాణం పెట్టి పని చేశారు. సెప్టెంబర్ 13న మా సినిమా రాబోతోంది. అందరూ చూడండి' అని అన్నారు. నిర్మాత పృథ్వీ యాదవ్ మాట్లాడుతూ.. 'కళింగ సినిమాకు పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. విష్ణు శేఖర్ ఇచ్చిన ఆర్ఆర్‌తో సినిమా వేరే లెవెల్‌కు వెళ్లింది. అక్షయ్ విజువల్స్ అద్భుతంగా ఉంటాయి. ప్రగ్యా నయన్ మాకు ఎంతో సహకరించింది. ధృవ వాయు ఈ చిత్రానికి మెయిన్ పిల్లర్. సెప్టెంబర్ 13న రాబోతోన్న మా చిత్రాన్ని అందరూ చూడండి' అని అన్నారు.



## 'విశ్వం' నుంచి మొరాకో మగువా సాంగ్

మాచో స్టార్ గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల ఫస్ట్ కొలాబరేషన్ లో వస్తున్న మోస్ట్ యాంటిసిపేటెడ్ మూవీ 'విశ్వం'. రీసెంట్ గా రిలీజైన టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్ తో సినిమాపై అంచనాలు మరింతగా పెంచింది. ఈ హై బడ్జెట్ ఎంటర్‌టైనర్‌ను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, వేణు దోనేపూడి చిత్రాలయం స్టూడియోస్‌పై టిజి విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. దోనేపూడి చక్రపాణి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. మేకర్స్ ఎలక్ట్రిఫైయింగ్, గ్రూవీ నంబర్ మొరాకో మగువాతో మ్యూజికల్ జర్నీ కిక్ స్టార్ట్ చేశారు. చేతన్ భరద్వాజ్ స్కోర్ చేసిన ఈ డైనమిక్ సాంగ్ కు పృథ్వీ చంద్ర, సాహితీ చాగంటి ఎనర్జిటిక్ వోకల్స్ అందించారు. లైవ్లీ టెంపో, షిఫ్టింగ్ రిథమ్స్ తో సాంగ్ అదిరిపోయింది. రాకేందు మౌళి లిరిక్స్ తెలుగు, ఇంగ్లీష్ ని అద్భుతంగా బ్లెండ్ చేసింది. గోపీచంద్, కావ్య థాపర్ రొమాంటిక్ కెమిస్ట్రీ, ఎలిగెన్స్ డ్యాన్స్ పెర్ఫార్మెన్స్ తో కట్టిపడేశారు. ఎక్సోటిక్ లొకేషన్స్‌లో చిత్రీకరించిన విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. మొరాకో మగువా సాంగ్ మ్యూజిక్ ప్రమోషన్‌లు కు చార్ట్ బస్టర్ స్టార్ట్ ఇచ్చింది.